

# అత్తగారూ- ఆవకాయా

సాధారణంగా మద్రాసులో వుండే తెలుగు జనాభాకు ఆవకాయ తినే ప్రాప్తం కలగడం అదృష్టంలో ఒక భాగం అని చెప్పాల్సిందే. విజయవాడదగ్గర్నుండి విశాఖపట్నంవరకూ వుండే వూళ్ళల్లో బంధువులో, తెలిసినవాండ్లో వుండి ఆవకాయజాడీలు మద్రాసుకు రవాణా చేస్తే తప్ప బంధువులూ, తెలిసినవాళ్ళూ - కనీసం ఆవకాయ సప్లయి చేసేరకం బంధువులు-యిద్దరూ లేని తెలుగువాళ్ళు మద్రాసులో కాసే మామిడికాయలు తినాల్సిందేకాని ఆవకాయ తినే అవకాశం లేదు.

ఆవకాయ పెట్టడం తెలిసిన బామ్మగార్లు వుండే కుటుంబాలకు బాధే లేదు. నూజివీడు రసాల కాయలూ, సామర్లకోట పప్పునూనే తెప్పించ లేకపోయినా మద్రాసు మామిడికాయలతో నైనా ఘుమఘుమలాడే ఆవకాయ పెట్టగలరు. ఎటొచ్చీ తింటం తెలిసి, ఆవకాయ పెట్టడం తెలియని మాబోటి వాండ్లకే అవస్థ. పోయిన సంవత్సరంవరకూ తెలిసినవాండ్లు బెజవాడ ప్రాంతాలనుండి ప్రతిఏటా ఆవకాయ పంపుతూండేవాళ్లు, రెండు మూడు పెద్ద జాడీల్లో. ఈ సంవత్సరం వా రింట్లో రెండు మూడు పెండ్లిండ్లు జరగడంవల్ల మాకు ఆవకాయ పంపే వ్యవధి వారికి లేకుండా పోయింది. ఇన్నాళ్లూ ఆవకాయనుగురించి ఆలోచించని నాకు 'ఇంట్లో ఆవకాయలేదు. యీ సంవత్సరం రాదు' అని తెలియగానే గుండె గతుక్కుమంది.

* * *

కొన్ని వస్తువులు వున్నప్పటికంటే లేనప్పుడు ఎక్కువ అగ్రస్థానం వహిస్తాయి, మనుషుల మనసుల్లో. అలాగే ఆవకాయ ప్రతి ఏటా వస్తున్నప్పుడు మా వంటచేసే అయ్యరు అన్నం వడ్డించిన వెంటనే 'ఆవహా ఊరుహా వేణుమా' అంటే మేము "వేండాబ్బా, ఎప్పుడూ ఆవకాయేనా

దరిద్రం" అన్నరోజులుకూడా ఉన్నాయి. ఆవకాయ వున్నప్పుడు మా వంట అయ్యరు పచ్చళ్లు చేయడానికి బద్ధకించేవాడు. ఈ సంవత్సరం ఆవకాయ లేకపోయేసరికి మా వంట అయ్యరు చేసే వంటలోని లోపాలన్నీ ఒక్కొక్కటే బయటబడ్డం మొదలెట్టాయి. ఈ సంవత్సరం వంట అయ్యరు ఏం చేస్తే అది తిని, నోరు మూసుకుని, వూరుకోవాలి గాబోలు నని అనుకున్నప్పు డంతా ఆవకాయకోసం నోరూరడం మొదలెట్టింది. ఆవకాయకోసం మా యింటికి మా వారి మిత్రులు కొందరు కుటుంబాలతో సహా భోజనానికి వచ్చేవారు, అప్పుడప్పుడు. "అహా! ఎన్నాళ్ళకు తిన గలుగుతున్నామండీ మన దేశపు ఆవకాయ" అని వాళ్ళంతా లొట్టలు వేస్తూ తింటుంటే, మేము చాలా నిర్లక్ష్యంగా "ఆఁ, ఆవకాయ కేం భాగ్యమండీ! మాకు ప్రతిఏటా వస్తూంటుంది ఆవకాయ" అనే వాళ్ళం గర్వంగా.

ఆ వచ్చినవాళ్ళు అందరూ సగంజాడీ తినేసి, సగంజాడీ యింటికి పట్టుకుపోయేవాళ్ళు తలా కాస్తా.

"అయినా అంత ఆవకాయ పట్టికెళ్ళిపోయారే! ఈ సంవత్సరం మన యింటికి చాల్తుందో లేదో" అని నేను అనుకుంటూంటే "అబ్బ! చాలకపోతే పోనిస్తూ! ఎంతని తింటాం ఆవకాయ! నాకు వద్దనే వద్దు. నీ క్కావాలంటే మిగిలిన ఆవకాయ దాచిపెట్టి తింటూండు" అన్నారు మావారు ఎగతాళిగా. ఆలాంటి మావారు యీ సంవత్సరం ఆవకాయ యింట్లో లేదని తెలిసిన తర్వాత తమేమన్నదికూడా మరిచిపోయి "అయ్యరుగాడు చేసే యీ పచ్చళ్ళు తింటం చాలా కష్టం. ఆవకాయ వుంటే బావుండేది.—" అంటం మొదలెట్టారు. మా అత్తగారు మడిలో వుంచిన నిమ్మకాయ వూరగాయతప్ప యింట్లో వేరే ఏ వూరగాయా లేదు. మా అత్తగారు కారం లేని నిమ్మకాయ వూరగాయ తింటుంది. మాకు సయించదు. అదే ఆమె మడితో ఒకమూల దాచిన బూజుపట్టిన నిమ్మకాయజాడీని ఎవరూ ముట్టుకోక పోవడానికి కారణం.

వారు ఒకరోజు మధ్యాన్నం భోంచేస్తూండగా, 'కొడుకు ఆవకాయలేదని పలవరిస్తున్నాడే' అని ఎంతో ప్రేమగా మడినిమ్మకాయ వూరగాయ తెచ్చి కొడుకుకంచంలో వడ్డించారు మా అత్తగారు....కొడుకు ఆ నిమ్మకాయ వూరగాయను ముట్టుకోకపోగా కంచంలోంచి తీసి కిందపడేశారు. మా అత్తగారు చూడలేదు గాని. చూస్తే చాలా నొచ్చుకునేదే పాపం.... తర్వాత నన్నడిగింది 'అబ్బాయి వూరగాయ ఎట్లా వుందన్నాడూ?' అని.

"చాలా బావుందన్నారు....కాని, ఆవకాయ వూరగాయంటేనే ఆయన కెక్కువ యిష్టం. ఈ సంవత్సరం ఆవకాయ రాలేదే, ఏం చేయడం, ఎవర్ని అడగడం అన్న దిగులు పట్టుకుంది" అన్నాను.

"ఆ, నీ దంతా చోద్యమే మరీనూ! ఎవర్నో ఎందుకడగడం? ఆవకాయ పెట్టడం ఏం బ్రహ్మవిద్య గనకనా, తెలీకడుగుతా! — అయినా అంత కారం, అంత నూనె వేసిన ఆ వుత్తరాదివాండ్ల ఆవకాయ మీరంతా లొట్టలేస్తూ తింటూంటే నా కళ్ళవెంట నీళ్ళు కార్తాయి. అయినా మనకెందుకులే అని వూరుకున్నాను. అసలు అంత కారంగా వుండే ఆవకాయ తింటే మీ ఒళ్లు ఏం గతి గానూంట?"

"ఏదో వారి కిష్టం" అన్నాను నేను.

"నే పెట్టిస్తానుండు ఆవకాయ" అన్నారు మా అత్తగారు, దర్జాగా కూర్చుంటూ.

నా ప్రాణం లేచివచ్చిన ట్లయింది. "అంతకంటేనా? మీరు గనక ఆవకాయ పెడితే యింక మనకు ఆవకాయ లేదన్న లోటు వుండదు యీ సంవత్సరం" అన్నాను సంతోషంగా.

"ఆఁ, నీదంతా చాదస్తమే మరీనూ! ఏ సంవత్సరమైనా మనింట్లోనే పెట్టుకోవచ్చు ఆవకాయ....ఏం బ్రహ్మవిద్యాంటాను — నిమ్మకాయెంతో ఆవకాయా అంతే" అన్నారు తేలిగ్గా మా అత్తగారు.

"అంతే, అంతే" అన్నాను ఆవిడేమన్నదో అర్థంగాని నేను....కాని—

నాకో సందేహం కలిగింది. మా అత్తగారి పుట్టినిల్లు చెంగల్‌పట్; మెట్టినిల్లు నంద్యాల. ఆవకాయకూ మా అత్తగారికీ ఎల్లాంటి సంబంధం వుంటుందా అని చాలాసేపు ఆలోచించాను; అడుగుదామనుకొన్నాను; మళ్ళీ 'ఆక్షేపిస్తోంది' అనుకుంటుందని వూరుకున్నాను.

"అయితే ఏమేం వస్తువులు కావాల్సుంటాయి, ఆవకాయ వేయడానికి" అని అడిగాను, తెల్లకాగితం, పెన్సిలు చేతపుచ్చుకొని, ఆవిడగారి గుమాస్తాలాగా. వెంటనే మా అత్తగారు కాలుమీద కాలు, మూతిమీద వేలు వేసుకొని ఒక్కక్షణం ఆలోచించారు.

"మామిడికాయలు కావాలిగా?" అన్నాను, మా అత్తగారి ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ.

"అబ్బే! ఎందుకే!" అన్నారు అలక్ష్యంగా చప్పరిస్తూ. నేను తెల్లబోయి ఆమెకేసి చూశాను.

"పదిహేనెకరాల మామిడితోటలో మనం వుంటూ, లక్షణంగా కాసే మామిడిచెట్లు పెట్టుకొని, యింకా కాయ లెందుకే మనకూ" అన్నారు చిరునవ్వు లొలకబోస్తూ.

"అయితే మన తోటలోని పండ్లకాయలే వేస్తానంటారా ఆవకాయ?" అన్నాను.

"ఓ! భేషుగ్గా వెయ్యొచ్చు. ఆవకాయకు కావలసింది మామిడికాయేగా! ఏకాయయితేనేం! మన తోటలో దక్షిణంవైపు చెట్లన్నీ భేషైన కాయలు కాస్తాయి. పడమటివైపు చెట్లు, ఎంత కండగల కాయ లనుకున్నావు —

పోయిన సంవత్సరం తోటంతా విరగకాశాయి కాయలు. 'మరినాలుగు వందలు ఎక్కువ చెప్పి కౌలు కివ్వవే' అంటే విన్నావు కాదు. వాడి కెంత లాభం వచ్చిందో తెలుసా! మన తోటవాడు చెప్పాడు. యీ సంవత్సరమూ అంతే. వాడి కింకా లాభంవస్తుంది....అట్లా కాసింది తోటంతా."

"పోనీలెండి, ఏటా కౌలుకు తీసుకునేవాడు నాలుగు డబ్బులు సంపాదించుకోనివ్వండి. పై సంవత్సరం అడగవచ్చు ఎక్కువ డబ్బు" అన్నాను.

"హాఁ-యిస్తాడు! మళ్ళీ ఏ నష్టమో వచ్చిందంటాడు, అందుకే యిప్పుడు ఆవకాయ పెట్టబోతున్నానుగా. అయిదువేల కాయలూ అడిగి పుచ్చుకుంటే సరి" అన్నారు మా అత్తగారు, దిట్టంగా బాసీపెట్టు వేసి కూర్చుంటూ.

"అయితే అయిదువేల కాయలూ ఆవకాయ పెడతానంటారా?" అన్నాను ఆశ్చర్యంగా.

"కాకపోతే! మీ చెల్లెళ్ళ యిండ్లకూ, యింకా తెలిసినవాండ్ల యిండ్లకూ పంపాల్సి వుంటుందిగా! కొద్దిగా పెడితే ఏం చాలుతుంది మనింటికి? వాడినిమటుకు అయిదువేల కాయలూ అడగాల్సిందే! డబ్బా తక్కువిచ్చి, కాయలూ యివ్వకపోతే ఎట్లా?" అన్నారు కౌలువాడిమీద కత్తికట్టిన మా అత్తగారు.

"అయిదువేల కాయలు వాడివ్వడేమో, మామూలుగా వాడివ్వాల్సిన కాయలు వెయ్యి. నేను అయిదువందల కాయలు చాలన్నాను. ఎటుతిరిగీ మనకు ఎవరో ఒకరు తెలిసినవాండ్లు రసాలూ, బంగనిపల్లిపండ్లూ పంపుతూనే ఉంటాదు గదా - యింకా మన తోటలోని పండ్లన్నీ ఎవరు తింటారనే వుద్దేశ్యంతో తగ్గించి యిమ్మన్నాను. మళ్ళీ యిప్పుడు అన్ని కాయలూ కావాలంటే ఏం బావుంటుంది" అన్నాను.

"ఆ ! నీ దంతా చోద్యమే ! నీవడక్కపోతే నే నడుగుతా నుండు. అన్నట్లు వాడిపే రేమిటీ.... జటాయువా. జానకిరామా ?—"

నాకు పక్కున నవ్వొచ్చింది-ముసలివా ళ్ళందరికీ జటాయు వంటే ఎందుకో అంత అభిమానం అని. "వాడిపేరు జటాయువూ కాదు, జానకి రామూ కాదు; దశరథుడు" అన్నాను నవ్వాపుకుంటూ.

"ఆ-ఏ అతిరథుడో.... ఎవడికి జ్ఞాపకం-వెంటనే వాడికి కబురుపంపి పిలిపించు. వాడిచేత అయిదువేల కాయలూ కక్కిస్తాను. పదిహేనెకరాల మామిడితోట కౌలుకు తీసుకుని తక్కువ డబ్బిచ్చి దగాచేసేది కాకుండా మామూలుగా మన కిచ్చే మామిడికాయలుకూడా తక్కువి స్తే ఎట్లాగూంట!" అన్నారు మా అత్తగారు పాయింటు దొరికిన ప్లీడర్‌గారికి మల్లే.

"ఒక్క మామిడికాయతోనే ఆవకాయ కాదుగా ! నూనె కావద్దూ ?" అన్నాను.

"ఎందుకూ ?" అన్నారు.

"ఎందు కేమిటీ, ఆవకాయలో నూనె వెయ్యరూ !" అన్నాను, ఆశ్చర్యపోతూ.

"వేస్తారు సరేనే - నూనె కొంటం ఎందుకూంట ! మన తామ్రంచేలో పండిన నువ్వులు ఎనిమిదిబస్తాలూ ఏమయ్యేట్టు ? మన యింటికి సంవత్స రానికి ఆరుబస్తాల నువ్వుల నూనె చాలు. పైరెండుబస్తాల నూనె వంట వాడు పొయిలోనే పోస్తున్నాడు."

"ఆ నూనె మీరు ఆవకాయలో పోస్తా నంటారు. అయితే రెండు బస్తాల నువ్వులనూనె అయిదువేల కాయలకు కావాలంటారు—" అన్నాను వ్రాసుకోబోతూ.

"అబ్బే ఎందుకే ! వెయ్యికి శేరునూనె. అయిదువేలకూ అయిదుశేర్ల నూనె ఎక్కువ" అన్నారు మా అత్తగారు.

"పప్పునూనెగదూ!" అన్నాను.

"ఏం పప్పూ! కందిపప్పూ! ఎందుకే, నీదంతా చాదస్తం. యింట్లో వుండే నూనెచాలు. మొన్న ఆడించిన ఆరుసేర్లనూనె ఆలాగేవుందిగా— అసలు నూనె ఎక్కువేస్తే మాకు సయించదు...." అన్నారు మా అత్తగారు.

ఆవకాయ అజ పజ తెలియని నేను మా అత్తగారు చెప్పిన వన్నీ భక్తితో లిస్టు వ్రాసుకోవడం మొదలెట్టాను; మధ్య మధ్య తెలిసీ తెలియని సందేహాలను ఒకవైపు నెడుతూ. ఆవకాయ విషయంలో పూర్తిగా మా అత్తగారిమీద ఆధారపడదల్చుకున్నాను.

"మరి కారం?" అన్నాను.

"అదీ అంతే! మన చేలో పండిన మిరపకాయలు అయిదుబస్తాలు స్టోరు రూములో మూలుగుతున్నాయి. ఒక్క బస్తామాత్రం వాడుక్కు బయట వుంచాను."

"అయితే మిగతా నాలుగు బస్తాల మిరపకాయల కారం అయిదువేల కాయలకు వేస్తానంటారా—?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇంకా నయం—అయ్యో పిచ్చిపిల్లా—"అంటూ మా అత్తగారు తన ఏనుగు దంతాలవంటి రెండు కోరల బోసినోటితోనూ విరగబడి నవ్వారు.

"మరి ఎంతకారం కావాలంటారు? కొట్టించాలిగా కారం!" అన్నాను.

"ఎందుకే—నీదంతా సింగినాదం మరీనూ! కారం కొట్టించడం మా తాతలనాడే లేదు; యిప్పు డెందుకే? మిషనుకు వేయిస్తే సరి. ఒక్క వీశకాయలు చాలు-మా కసలు కారం సయించ దన్నానుగా!"

"మరి వీశకాయల కారం అయిదువేల మామిడికాయలకు చాలా!" అన్నాను వుండబట్టలేక.

"ఆ! చాలకే మొచ్చిందే! ఉత్తరాదివాళ్ళలాగా అంతకారం నే వేయ నమ్మా—అంతగా చాలకపోతే తర్వాత కాస్త వేసుకోవచ్చులే. మొన్న

నేను నిమ్మకాయకు అసలు కారమే వేయలేదు, చూశావుగా. అయినా నాలిక చుర్రుమంటూనే ఉంది'' అన్నారు మా అత్తగారు.

మధ్యాహ్నం మా వారు పారేసిన నిమ్మకాయ అదేగదా అనుకుని మనసులోనే నవ్వుకొన్నాను.

"అయితే కారం చాలకపోతే తర్వాత వేసుకోవచ్చంటారు'' అన్నాను, కారం చాల దనే సందేహం వదలక.

"ఓ, భేషుగ్గా వేసుకోవచ్చు. నిమ్మకాయకు వేయడంలా ఉప్పూ కారం, కావాలంటే. అంతే! నిమ్మకాయెంతో ఆవకాయంతే—'' అన్నారు మళ్ళీ.

"అయితే మరి ఆవపిండో!'' అన్నాను. అన్నీ నేనే అందిస్తూ వస్తున్నాను.

"ఆ—ఆ—.ఆవాలు మాత్రం కొద్దిగా కొనాలి. మిగతా అన్నీ మన యింట్లోనే వున్నాయి-ఉప్పూ, పసుపూ, మెంతీ గింతీని. ఆవపిండి మన కెంతసయిస్తే అంతే వేసుకోవచ్చు. అయిదువేల కాయలకూ ఒక సేరు ఆవ పిండి చాలని నా అభిప్రాయం. ఎక్కువయితే వేడిమి చేస్తుంది.

"నన్నడిగితే వుప్పెంతో కారం అంత, కారం ఎంతో ఆవపిండి అంత, అవన్నీ ఎంతో నూనె అంత-నిమ్మకాయెంతో ఆవకాయంతా-'' అని ముగించారు అత్తగారు. ఆవిడ చెప్పిన వన్నీ శ్రద్ధగా వ్రాసుకొన్నాను కాగితంమీద.

"అన్నట్లు, ఆ కౌలువాడిపే రేమిటో మరిచిపోయాను....వాణ్ణి పిలి పించు, తక్షణం-వాడితో మాట్లాడో, పోట్లాడో అయిదు వేల కాయలూ తీసు కున్న దాకా నిద్రపట్టదు నాకు...." అంటూ లేచి గోల్కొండ వ్యాపార్ల గోచి సరిచేసుకుంటూ వంటింటి వైపు వెళ్ళారు మా అత్తగారు.

నేను అత్తగారి ఆజ్ఞానుసారం మామిడితోట కౌలుకు తీసుకున్న దశరథుడికి కబురు పెట్టాను.

దశరథుడు చేతులు కట్టుకుని వినయంగా వచ్చి మా అత్తగారి ముందు నిలబడ్డాడు. నే నుంటే మరీ ఏడ్చిపోతాడని పులిముందు మేక పిల్లను వదలి పెట్టినట్లు మా అత్తగారి ముందు దశరథుణ్ణి వదలి నేను వెళ్ళి వంటింటి ముందున్న వడ్లబస్తాలమీద కూచున్నాను.

మా అత్తగారు హైకోర్టులో వాదించే లాయర్లకుమల్లే దశరథుడితో వాదిస్తోంది. వాడి కాలికివేసీ, మెడకువేసీ, చివరకు అయిదువేల కాయలూ యివ్వకపోతే మామిడితోట విడిచిపెట్టి పొమ్మన్నా రామె. యిచ్చిన అడ్వాన్సు డబ్బు కావాలంటే తిరిగి యిచ్చేస్తానని కూడా డబాయించింది. దాంతో నిజంగానే దశరథుడు భయపడిపోయాడు....

"అయితే, అమ్మగారూ, అయిదువేల పండ్లయితే నే నిస్తాను అప్పు డప్పుడు - కాయ లేంచేసుకుంటారు తల్లీ" అన్నాడు, భయపడుతూన్న దశరథుడు....

"ఆవకాయ వేస్తాన్రా-ఆవకాయా....అయినా, ఏం చేస్తామో నీతో చెపితేనే యిస్తావా కాయలు ?" అని గద్దించి అడిగారు మా అత్తగారు....

"అది కాదండీ అమ్మగారూ ! అయిదువేలూ పండ్లువేస్తారా, కాయ లుగా కావాలా అని అడిగానండీ ! యిప్పటికే బాగా ముదిరి పండబారి పొయ్యాయి కాయ లన్నీ" అన్నాడు దశరథుడు.

ఆ మాట విన్న నా గుండె గతుక్కుమంది. మా అత్తగారు పండావ కాయ పెట్టబోతారేమో నని భయపడ్డాను....

"ఆ ముదిరి పండబారిన కాయలు పిల్లలు తింటారు. కాని, నువ్వు మాత్రం అయిదువేల కాయలకూ ఒక్కటి తక్కువ ఇచ్చినా తీసుకోను, జాగ్రత" అని మా అత్తగారు దశరథుడిని పంపించేశారు.

మామూలుకంటే జోర్‌గా నడుస్తూ వచ్చారు మా అత్తగారు వంటింట్లోకి.

"ఏమన్నాడు అన్నాను" ఏమీ విననట్లు.

"ఏమంటాడు! కుక్కిన పేనల్లే దక్కిస్తూ యిస్తాడు, అయిదువేల కాయలూనూ. లేకపోతే తోటవిడిచి పొమ్మన్నాను. వచ్చేఏడు డబ్బుకూడా యిలాగే డబాయించి తీసుకోవాలి గాని వా డెంతంటే అంతకు నిక్షేపం లాంటి మామిడితోట వదుల్తారటే ?—" అన్నారు సింహలగ్నంలో పుట్టిన మా అత్తగారు. నేను గుడ్లప్పచెప్పి ఆమెకేసి చూస్తూ వుండిపోయాను.

ఎల్లుండు తెల్లారుజామున మా అత్తగారు హడావిడిగా యింటిల్లిపాదినీ నిద్రలేపారు. వంటచేసే అయ్యరు పక్కింటినుంచి రెండు కత్తులూ, ఎదురింటినుంచి రెండు కత్తిపీటలూ తెచ్చాడు. ఇంట్లో మూల పారేసిన మొద్దుకత్తులూ, తుప్పుపట్టిన కత్తిపీటలూ తీసుకుని రణరంగానికి బయలు దేరినట్లు పనివాళ్ళూ, నేనూ, మా అత్తగారూ వంటింటి ముందు వసారాలో చేరాం.

అయిదువేల కాయలూ పెరటివేపు వరాండాలో రాశి పోసివున్నాయి. మా అత్తగారు ఆ రాశి చూస్తూనే "చాలాకాయ లొచ్చాయే! మనం ఐదు వేలేగా అడిగింది! వెధవ, భయపడి పదివేల కాయలు కక్కినట్లున్నాడే!" అన్నారు.

"వాడు ప్రస్తుతం కక్కిందీ అయిదువేల కాయలే" అన్నాను, నవ్వు ఆపుకుంటూ. మా అత్తగారి ముఖం వెలవెల బోయింది.

మొదటిరోజు రెండువందల కాయలూ, రెండవరోజు మూడువందల కాయలూ తెగేసే సరికి రెండుకత్తులూ పిళ్ళు విరిగాయి. ఒకకత్తి పూర్తిగా రెండుతునక లయింది. రెండు కత్తిపీటలు వంగిపోయాయి. మిగతా నాలుగువేలా అయిదువందల కాయలూ పండ్లయి పోయాయి మూడో నాటికి....మా అత్తగారి ముఖం నల్లబడిపోయింది.

"పోనీ, ముందీ అయిదువందల కాయలకూ పిండీ నూనే వెయ్యండి" అన్నాను—అప్పటికే ఆవకాయకు నీళ్ళు వదిలేసిన నేను, ఉసూరుమంటూ.

"ఆ....అంతే చేయాలి....వెధవ పండబారిన కాయ లిచ్చి దగా చేశాడు." అన్నారు, తప్పుకోడానికి ప్రయత్నించే మా అత్తగారు.

"వాడేం దగా చేయలేదు—వాడు ముందే చెప్పాడు, పండబారాయి కాయ లన్నీ అని" అన్నాను లోపల్నుంచి వచ్చే కోపాన్నంతా మింగుతూ.

"ఆ—అదేలే—అయితే ముందీ ముక్కలకు కారం, ఉప్పూ, పిండీ పట్టిస్తామా—ఏం!" అన్నారు మాట మారుస్తూ మా అత్తగారు.

"మీ యిష్టం—అలాగే కానివ్వం"డన్నాను నేను నీరసంగా.

అయిదువందల కాయల ముక్కలే ఒక పెద్దగంగాళంనిండా వున్నాయి. ఇంట్లో వున్న చిన్నజాడీలు నాలుగూ తెచ్చి మా అత్తగారి ముందు పెట్టాను.

పిండీ, నూనే కలపకుండానే ముక్క లన్నీ నాలుగుజాడీలకు పట్టించడం మొదలెట్టారు. యింకా సగం ముక్కలు మిగిలిపోయాయి. నాలుగు జాడీలూ నిండిపోయాయి. మా అత్తగారు గుడ్లు తేలేశారు. నేను వెంటనే మరో నాలుగుజాడీలు టౌనునుంచి తెప్పించి ఆవిడముందుంచాను. మిగతా ముక్కలన్నీ కొత్తగా వచ్చిన నాలుగు జాడీలకూ సరిపోయాయి. అయిదువందల కాయలకే ఎనిమిది జాడీ లైతే అయిదు వేల కాయలకు యెన్ని జాడీలు కావాల్సివచ్చేదో తల్చుకుని హడలెత్తి పోయాను.

ఎనిమిది జాడీల్లోనూ గుప్పెడు గుప్పెడు కారం, ఉప్పూ, ఆవపిండీ వేసి ఒక్కో జాడీకి రెండు గరిటెలు నూనె పోసి మూతపెట్టి 'కృష్ణా' అంటూ లేచారు మా అత్తగారు.

"ఆవకాయ పెట్టడం అయిపోయిందా?" అన్నాను.

"ఆహా! ఒక వారంరోజులు ఆ జాడీలవైపు వెళ్ళకుండా వుంటే సరి" అన్నారు మా అత్తగారు, చేయి కడుక్కుంటూ.

'ఆవకాయ వేయడం యింత సులభమని తెలిస్తే నేనే వేసివుండే దాన్నే' అనుకున్నా మనసులో.

వారం రోజుల తర్వాత 'మా యింట్లో మా అత్తగారు ఆవకాయ వేశారు కాబట్టి భోజనానికి రావాల్సింది' అంటూ మా చెల్లెళ్ళకూ, తెలిసిన వాళ్ళకూ కబురు పంపాను. ఆవకాయకోసం ముఖం వాచిన మా చెల్లెళ్ళూ, మరుదులూ, అందరూ పిల్లాజెల్లాతో సహా వచ్చేశారు.

అంతా భోజనానికి కూర్చున్నారు. మా అత్తగారు వంటింట్లో హడావిడి పడుతున్నారు .... ఆవకాయకోసం నేను వెళ్ళేసరికి — ఏముందీ? మూతలుతీసి చూస్తే ఆవకాయలేదు — మామిడిపండ్ల ముక్కలున్నాయి, బూజుపట్టి. మా అత్తగారి ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు....

---